మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

**టూరిజం సర్క్యూట్‌గా కురుమూర్తి,**
**మన్నెంకొండ,పిల్లలమర్రి**
**మహబూబ్‌నగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 14, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రిలో పలుఅభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా,అందులో భాగంగా ఈరోజు రూ.2.5కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు.పార్క్‌ను ప్రముఖ పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, టూరిస్టుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని ఆయన తెలిపారు.అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లలమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, 1వ డివిజన్ కార్పొరేటర్ దేప్లీ మేఘ్యానాయక్, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, నాయకులు వర్థ రవి, అశ్వాక్, హాకీం, కాటం రాజు, జిల్లా పర్యాటక అధికారి జె.రాజశేఖర్ రెడ్డి, టిఎస్‌టిడిసిడిఈ పర్షవేది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## రాచాలపల్లి గ్రామంలో
# రైతులతో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖాముఖి

- **తేమ శాతం పరిశీలించి ధాన్యం తీసుకురావాలి**
- **రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**ఊర్కొండ,మే 14 ప్రభాతవార్త:** వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందు తప్పనిసరిగా తేమ శాతం సరిచూసుకోవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత తేమ శాతం ఉన్న ధాన్యాన్నే వెంటనే కొనుగోలు చేస్తారని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గ్రామంలో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు వద్దకు వెళ్లి పంట దిగుబడి, ధాన్యం నాణ్యత, కొనుగోలు కేంద్రాలకు తరలింపు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అలాగే ధాన్యంలో, రాళ్లు, మట్టి లేకుండా శుభ్రంగా ఉంచితే కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని వివరించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరుగుతుందని, ధాన్యం సేకరణ పూర్తైన తర్వాత 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం గుడిగానిపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదకరంగా మారిన భవనాన్ని తొలగించి, నూతన పాఠశాల భవన అనుమతులు ఇవ్వాలని కోరగా, అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీఓ శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి, ఊర్కొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

# నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట, మే 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద రూ.55 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ పనులను గురువారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై ఆర్‌అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనంలోని సీలింగ్, ఎలక్ట్రికల్ పనులను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన సముదాయం నిర్మాణంతో పాటు బయట రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. జూన్ నాటికి అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ వెంకటరమణ, డీఈ రాములు, ఏఈలు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలపై ప్రజలకు
# అవగాహన కల్పించాలి

**నారాయణపేట,మే 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాఅభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. అర్హులైన ప్రతిలబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలోని 4 శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,సంక్షేమ కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. పథకాలు రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అమలు కావాలని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ భవనాల కొరత, పెండింగ్ బిల్లుల సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. చిన్న,సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో వైద్యసేవలు,అంగన్‌వాడీ కేంద్రాలు, మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. కేంద్ర పథకాల నిధుల వినియోగంపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతకు పరిశ్రమల స్థాపనలో ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. రోడ్లు, విద్య, గృహ నిర్మాణం, వ్యవసాయం తదితర అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. చివరగా జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ శాఖల అధికారులు సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో దిశ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ



హాజరైన అధికారులు

# ధాన్యం గోదాములకు తరలించాలి

**రవాణాకు లారీలు, ట్రక్కులు ఏర్పాటు చేయాలి**
**గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలి**
**మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి**
**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం**
**జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డ్ లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ**



మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**జడ్చర్ల,మే 14, ప్రభాతవార్త:** జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ జడ్చర్ల మండలంలోని పత్తి మార్కెట్‌యార్డును తనిఖీ చేసి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.మార్కెట్ యార్డ్‌లో కలియతిరిగి మొక్కజొన్న కొనుగోలు లోడింగ్,ఆన్ లోడింగ్,స్టోరేజిని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా పిఏసిఎస్,మార్క్ ఫెడ్,సహకార శాఖఅధికారులతో,రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటివరకు ఎన్ని బస్తాలు కొనుగోలు చేసారు, ఇంకా ఎన్ని బస్తాలు కొనుగోలు చేయాల్సి ఉంది అని అడిగి తెలుసుకున్నారు. సుమారు 40 వేల బస్తాలు కొనుగోలుచేసి మార్కెట్‌యార్డ్‌లో తాత్కాలికంగా స్టోరేజీచేసినట్లు తెలిపారు. సుమారు 30 వేల బస్తాలు కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటికి సీరియల్ నంబర్ ప్రకారం టోకెన్‌లు జారీ చేసినట్లు, రెండు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని కలెక్టర్ కు వివరించారు. లోడింగ్ ,ఆన్ లోడింగ్ త్వరగా పూర్తిచేయుటకు హమాలీలను అదనంగా నియమించినట్లు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేసి మహబూబ్‌నగర్ పట్టణంలో మార్క్ ఫెడ్ అధికారులు గుర్తించిన గోదాములకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. పిఏసిఎస్ అధ్యక్షులు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి,లోడింగ్,అన్‌లోడింగ్ త్వరగా గావించి గోదాములకు రవాణా చేసేలా బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరగేలా చూడాలని సూచించారు. గన్నీ బ్యాగులు కొరత లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు రైతుల ధాన్యాన్ని అకాల వర్షాల నుండిరక్షించేందుకు టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, గన్నీ బ్యాగులు సరిపడ అందుబాటులో ఉండేలా చూడాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మార్కెట్ యార్డులో ఎక్కువకాలం నిల్వ ఉంచవద్దని స్పష్టం చేశారు. రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలు, ట్రక్కులు ఏర్పాటు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఉదయం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ పత్తి మార్కెట్ యార్డ్‌ను సందర్శించి మొక్క జొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మార్క్ఫ్ ఫెడ్ డియం తహమీన, మార్కెట్ కార్యదర్శి సిరాజుద్దీన్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుగోపాల్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

# చరిత్రను ఎలిగెత్తి చూపే విధంగా జిల్లా గ్రంథాలయం

**వనపర్తి చరిత్రను ఎలిగెత్తి చూపే విధంగా**
**జిల్లా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుకుందాం**
**రాష్ట్రంలోని మొట్టమొదటి డిజిటల్ లైబ్రరీ**
**వనపర్తిలోనే ప్రారంభం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, మే 14, ప్రభాతవార్త:** ఎంతో ఘన కీర్తి కలిగిన వనపర్తి జిల్లా చరిత్రను కళ్లకు కట్టినట్లుగా చూపించేలా జిల్లా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుకుందామని, సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రూ. రెండు కోట్ల రూపాయలను మంజూరు చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కోరారు. గురువారం వనపర్తి జిల్లా గ్రంథాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన మొదటి అంతస్తును ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డితో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. కవులు, కళాకారులు, సప్త సముద్రాలు కలిగియుండి వందల సంవత్సరాల ముందే ఎంతో ఘన కీర్తి గలిగిన వనపర్తి చరిత్రను గ్రంథాలయంలో ప్రస్ఫుటించే విధంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి డిజిటల్ లైబ్రరీని వనపర్తి గ్రంథాలయంలోనే ప్రారంభించుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. విద్యాపర్తిగా పేరుందిన వనపర్తి జిల్లాలో పూర్వ విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వపరమైన అన్ని విద్యా సంస్థలను వనపర్తిలో ఏర్పాటు చేసుకున్నమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాద్, వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈవెంట్ మేనేజ్మెంట్ వ్యాపార సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వనపర్తి పట్టణం రాజీవ్ చౌరస్తాలో గల షిరిడి సాయి కాంప్లెక్స్‌లో ఆంజనేయులు ఏర్పాటు చేసుకున్న శ్రీరస్తు శుభమస్తు ఈవెంట్ వ్యాపారసముదాయాన్ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మారుతున్న సమాజానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ మారాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఫోటోలు వీడియోలకు సంబంధించి ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని ,ఆ మార్పులకు అనుగుణంగానే మనం ముందుకెళ్లాలన్నారు. ఇలాంటి ఈవెంట్స్ చేసే విభాగాలు ఏర్పాటుచేయడం ద్వారా పెళ్లిళ్ల పేరంటాలతో పాటు ఇతరత్రా శుభకార్యాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ మేనేజ్మెంట్ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న ఆంజనేయులును ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో జర్నలిస్టు మిత్రులు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మెగా రెడ్డి, డిసిసి చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్

## కేంద్ర కేబినెట్‌లోకి
# జేజమ్మ?

**కేంద్ర మంత్రివర్గ విస్తరణలో మహబూబ్‌నగర్**
**ఎంపీ అరుణమ్మకు ఛాన్స్?**
**సర్వత్రా చర్చనీయాంశం**
**అరుణమ్మకే ఇవ్వాలని**
**కోరుతున్న పార్టీ శ్రేణులు**
**కేంద్రం నిర్ణయం పై ఉత్కంఠ**

4



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**ప్యాడి క్లీనర్స్ వినియోగిస్తేనే నాణ్యమైన ధాన్యం**
**ఇతర రాష్ట్రాల ధాన్యం కేంద్రాలకు**
**రాకుండా చెక్ పోస్ట్‌ల వద్ద పటిష్ట చర్యలు అవసరం**
**యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతం**
**చేయాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలు**

**కెటిదొడ్డి,మే14, ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల కేంద్రంతో పాటు పరిధిలోని కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి ముందుగా తీసుకొచ్చిన రైతుల ధాన్యానికి నిబంధనల ప్రకారం తేమ వస్తే వెంటనే తూకం చేసి మిల్లులకు తరలించాలన్నారు. ముందు వచ్చిన రైతులకు కాకుండా వెనుక వచ్చిన వారి ధాన్యం కొనుగోలు చేయడం సరికాదన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తికాగానే ఓపిఎంఎస్ కాకుంటే రైతులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడతారన్నారు. కేంద్రం నిర్వహకులు, సంబంధిత అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాడి క్లీనర్స్‌తో ధాన్యంను శుభ్రం చేయకుండా మిల్లులకు పంపిస్తే మిల్లర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తారన్నారు.దొడ్డు,సన్నరకం ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.లారీలు, హమాలీల సమస్య కేంద్రాల వద్ద లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కుప్పలను పరిశీలించి నిర్దేశిత తేమశాతం రాగానే తూకం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. లారీలలో సంబంధిత మిల్లులకు ధాన్యం పంపే క్రమంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు.వివిధ రిజిస్టర్‌లను పరిశీలించి, ట్రక్ షీట్ వివరాల్లో తప్పిదాలు ఉండడంతో సరిచేసి పంపాలని, నిబంధనలను అతిక్రమిస్తే షోకాజు నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం నందిన్నె అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద చేస్తున్న వాహనాల తనిఖీ విధానం, రిజిస్టర్ నిర్వహణ,ఆయావాహనాల పత్రాల పరిశీలన తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఇతర జిల్లాలు, రాష్ట్రాలనుంచి వచ్చే ప్రతివాహనాన్ని తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.జిల్లాలోని ధాన్యంకొనుగోలు కేంద్రాలకు ఇతరరాష్ట్రాల మొక్కజొన్న,వరిధాన్యం రాకుండా చూడాలన్నారు. ప్రతి వాహనం యొక్క నంబర్, సరకురవాణాకు సంబంధించిన బిల్లు నంబర్లు,సంబంధిత పత్రాల వివరాలను నిర్దేశితరిజిస్టర్‌లో నమోదుచేయాలని సూచించారు. కేవలం జిరాక్స్ ప్రతులు తీసుకోవడం సరిపోదని,సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.అవసరమైతే –మిగతా4లో..



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## బండి భగీరథున్ని వెంటనే శిక్షించాలి

**సిపిఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు**




నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

**అచ్చంపేట,మే 14 ప్రభాతవార్త :** మైనర్ బాలికపై అత్యాచారం చేస్తే తల్లిదండ్రులు స్వయానా పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసిన బండి భగీరథుని అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్ధ సైదులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో అంబేద్కర్ కూడలి వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు పోక్సో కేస్ కింద పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే అరెస్టు చేయాలని మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడిగా ఉండడం వల్లనే సామాన్యుడు పెట్టినటువంటి కేసు నీరు గార్చే ప్రయత్నం చేయడం తగదని వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ఎవరికి చట్టం కాదని ఎంతటి వారైనా శిక్షించక తప్పదని వారు మాట్లాడారు.కేసును తప్పుదోవ పట్టించే విధంగా పోలీసులు వ్యవహరిస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు బి.రాములు, శివకుమార్, ఎస్.వెంకటయ్య, పర్వతాలు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, అడ్డకూలి సంఘం కార్యదర్శి వెంకటయ్య, సిపిఎం నాయకులు రాజు, మల్లేష్, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం

## రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడిగా లయన్ నటరాజ్



**మహబూబ్‌నగర్ మే 14, ప్రభాతవార్త :** సావిత్రి బాయి పూలే విద్యా చారిటబుల్ ట్రస్ట్ అనుబంధ విభమైన అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా డా.లయన్ అంబటి నటరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్ పర్సన్ డా. గూడూరు సీతా మహాలక్ష్మీ, మేనేజింగ్ ట్రస్టి ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా దానం లక్ష్యంగా అనాథ, నిరుపేద విద్యార్థుల చదువుకు చేయూత, ప్రోత్సాహం అందించడం, మరణించు, జీవించు నినాదంతో దేశ వ్యాప్తంగా శరీర దానం, అవయవ దానం పై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ఈ సంఘానికి మహబూబ్ నగర్ చెందిన సామాజిక సేవకులు, రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజును తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేత్ర దానం,అవయవ దానాలపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పిస్తున్న నటరాజు సేవలను గుర్తించి రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ఈసందర్భంగా లయన్ నటరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండ బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. మేరకు తన నియమాకానికి సహకరించిన డా. గూడూరు సీతా మహాలక్ష్మీ, ప్రొ॥ ఆనంద్ స్వరూప్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల సొంతింటి కల నెరవేరింది



గృహప్రవేశం చేస్తున్న మంగలి నట్టి పద్మ కుమారి

**నారాయణపేట, మే 14 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని వార్డు నెంబర్8 అశోక్ నగర్కు చెందిన లబ్ధిదారురాలు మంగలి నట్టి పద్మ కుమారి, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా తన సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించుకున్న సందర్భంగా ఆమె పత్రికా ముఖంగా తన ఆనందాన్ని పంచుకున్నారు. నిరుపేదలకు సొంతిల్లు అనేది జీవితకాల కల అని, ఆ కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు పథకం నిజం చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఇంటి మంజూరు నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారుల పర్యవేక్షణ,సహకారం ఎంతో తోడ్పడిందన్నారు. అలాగే ప్రతి దశలో తమకు అండగా నిలిచి ప్రోత్సహించిన వార్డ్ కౌన్సిలర్ కందనిపల్లి సత్యమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్‌తో పాటు వారి బృంద సభ్యులు కురువ మనోజ్, సిద్ధం లక్ష్మణ్, జరంగ్ రాములకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించినట్లు వెల్లడించారు.

## కల్వర్టు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

**కల్వకుర్తి, మే 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీలో మహబూబ్‌నగర్ చౌరస్తా నుండి శివాజీచౌక్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్టిసి డిపో ఎదుట నిర్మించనున్న కల్వర్టు పనులను మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, ప్రయాణీకులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్స్ కొల్లోజు రాజేష్, ఏజాస్, నాయకులు రామకాంత్ రెడ్డి, మక్బుల్, వర్కాల భాస్కర్ రెడ్డి, బృంగి ప్రవీణ్, బంగారి కేశవులు, సంతు యాదవ్, పురుషోత్తం, ముక్తాధర్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, నరేందర్, మహేష్, పవన్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి

**ఆత్మకూర్ మే 14, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నటువంటి కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షల రూపాయల వరకు ప్రభుత్వాలు కల్పించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి మరియు తిప్ప డంపల్లి గ్రామాలలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఉపాధి కూలీలు సమర్థవంతంగా ఎదుర్కోవాలని అందులో భాగంగానే ఈనెల 15న చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించాలని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని అంతేకాకుండా రోజుకు 600 వేతనం చెల్లించే విధంగా చీరలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల మూలంగా ఉపాధి హామీ పథకం గల్లంతయ్యే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజు వెంకటేష్ పుల్లన్న రాములు తదితరులతో పాటుగా పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## టీబి క్యాంపు విజయవంతం



టిబి క్యాంపులో వైద్య సిబ్బంది

**నవాబుపేట,మే 14 ప్రభాతవార్త :** మండలంలోని చౌదూరు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో గురువారం టిబి క్యాంప్ నిర్వహించడం జరిగింది. డా. శ్రావణ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమాన్ని 14 సంవత్సరాల పైబడి ,రెండు వారాల కన్నా మించి దగ్గు,జ్వరం, దగ్గినప్పుడు రక్తం పడడం చాతి నొప్పి, బరువు తగ్గడం శరీరంలో మెడ మరియు ఇతర భాగాల్లో వాపులు ఇలాంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా ఈ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కోట సునీత ఆంజనేయులు డిప్యూటీ సర్పంచ్ లక్ష్మణ్ క్యాంపును ప్రారంభించారు.చౌదూర్ మొత్తం 81 మందిని పరీక్షించగా 80 మందికి ఎక్స్ రేలు తీయడంజరిగింది. 04 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా.శ్రవణ్ , రాములు, ఏపీవో శ్రీనివాసులు హెల్త్ సూపర్‌వైజర్ రాజు, యాసీన్, రంజిత్, లక్ష్మి, టిబి సూపర్‌వైజర్లు, అసిఫా, స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు విజయ, కన్వర్ బేగం, మంజుల యాదమ్మ పాల్గొన్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

- గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు
- ఊర్కొండ మండల గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

**ఊర్కొండ, మే 14 ప్రభాతవార్త:** ఉరుకొండ మండలం రాచాలపల్లి, రేవల్లి, గుడి గాని పల్లి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, 7 గంటలకే గ్రామాలకు చేరుకున్న అధికారులు గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి సరఫరా, సాంకేతిక సహాయం విషయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను శాశ్వత పరిష్కారంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా డ్రైనేజ్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పైప్‌లైన్ వ్యవస్థను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రజాధనం వృథా కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా గ్రామాల్లోకే వెళ్లి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు ఇళ్లు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, అధికారులు ప్రజలతో సమన్వయంతో పని చేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీఓ శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, ఊర్కొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కల్పించిన హక్కుతోనే నేను ఎమ్మెల్యే అయ్యాను

**భారత రాజ్యాంగాన్ని మహిళలకు సమన హక్కులు కల్పించిన వ్యక్తి**

**డా ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే జియంఆర్**



డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**మదనాపురం, మే 14 ప్రభాతవార్త :** డా.బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని ఆయన కల్పించిన హక్కుతోనే నేను దేవరకద్ర ఎమ్మెల్యేగా అయ్యాడని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తీర్మాలయపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పూలదండలు వేసి నివాళులుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన హక్కుతోనే నేను ఎమ్మెల్యే అయ్యాను అన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగంలో చదువుతోనే ఒకటే మనతరం రాతలు మారుతాయని ఆయన సూచించారు తమిళనాడులో దళిత బిడ్డ విజయ్‌ని ముఖ్యమంత్రి కావాలని ముందుకు వచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ ఆయన తెలిపారు. దళిత బిడ్డను విజయ్ ముఖ్యమంత్రి కాకుండా చేయాలని అడ్డుపడితే కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ముఖ్య మంత్రి చేసింది కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు.అణచివేత, చిన్నచూపునకు గురైనా అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరూ సాధించలేని ఉన్నత చదువులు చదివి భారతదేశానికి వచ్చి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని అమలు చేయడంతో తీవ్రలోపం ఉందని, దీనివల్ల దేశంలో ప్రమాదకర అవకతవకలు జరుగుతున్నాయన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని,నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పదంలో ఉండాలన్నారు,ఏ వర్గమైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఈ దేశంలో ప్రతి వారికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అని,ఒక వర్గం, కులానికి కాదని, అందరి కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా మేధావని కొనియాడారు, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు స్థలాలు ఇచ్చిన మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటనారాయణ ఘనంగా సన్మానం చేశారు,ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రాజు, ఎంపీడీవో ప్రసన్నకుమారి,మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల కో ఆర్డినేటర్ చుక్క మహేష్, జగదీష్ సర్పంచులు పోతురాజు రాములు, శారదరామకృష్ణ,మండల నాయకులు వేమన్న, హనుమాన్ రావు, సత్య శీలారెడ్డి, వడ్డే రాములు,చర్లపల్లి శేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్, శ్రీను, రాజిరెడ్డి ,శాంతన్న,అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదు

**నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**

**కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఎస్ఓ**



కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన డిఎస్ఓ

**నవాబుపేట,మే 14 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటపై నిర్లక్ష్యం వహించకుండా, కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అధికారి డీఎస్ఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లూరు లోకిరేవు, పోమాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారి డిఎస్ఓ తో పాటు మండలాధికారులు తహసిల్దార్ సురేష్, ఆర్ఐ రామాంజనేయులు ఎంపీడీవో జయరాం నాయక్, ఐకేపీ సెర్ఫ్ అధికారులు ఏపిఎం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించడం, ప్యాడీ లోడ్లు వెళ్లే ఎంట్రీలు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వివరాలు, వాహనాల సమాచారం,ధాన్యం రాకపోకల వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులకు నష్టం వచ్చేటట్లు ప్రవర్తిస్తే చర్యలు తప్పవని మండల తహసిల్దార్ సురేష్‌అన్నారు. ఏఈఓలు కేవలం తేమశాతం పరిశీలించి వెళ్లిపోవడం సరికాదని, సెంటర్లోకి వచ్చే బయటకు వెళ్లే ధాన్యాన్ని పర్యవేక్షించడం, రిజిస్టర్లు పరిశీలించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఐకెపి సెర్ప్ అధికారులు, మండల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అజయ్

**అమరచింత మే 14, ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వి బి జి రామ్ కొత్త చట్టాన్ని అమలు చేయడాని వ్యతిరేకిస్తూ ఈనెల 15న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు అజయ్ తెలిపారు. గురువారం అమరచింత మండలం ప్రియదర్శిని గ్రామ ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ అజయ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలు పనిచేసిన అధికారులు కూలి డబ్బులు చెల్లించకపోవడం బాధాకరమని ఇప్పటికైనా పెండింగ్ కూలీల వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు రోజుకు 600 ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు గడ్డపార, పారా, కొడవలి సరఫరా చేయాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పిస్తూ జాబ్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో భూమిలేని కూలీలకు ఏడాదికి 12000 ఇస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. ఉపాదా హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనము నెలకు 26000 ఇవ్వాలని, ఉపాధి హామీ పనిలో జరిగే ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి హామీ కూలీలు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కురువ ఆంజనేయులు, భీమ్ రెడ్డి, సులోచనమ్మ, సావిత్రి, జయమ్మ, రాకేష్, వి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడి.. అమ్మ ఒడి



బడిబాట ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు బృందం

**చిన్నచింతకుంట, మే 14 ప్రభాతవార్త :** ప్రభుత్వ బడి అమ్మ ఒడి లాంటిదని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. గురువా రం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని లాల్ కోటలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అం దుతుందని అన్ని రకాల ఉచిత పుస్తకాలు, నాణ్యమైన భోజనం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనుభవజ్ఞులైనా ఉపాధ్యా యులచే విద్యాబోధన అందించడం వల్ల మండలంలో టాపర్లుగా విద్యార్థులు నిలుస్తున్నారన్నారు. ఆయా గ్రామాలలో ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బలో పేతానికై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల నమోదును పెంచేందుకు దోహదపడాలన్నారు. అనంతరం బడిబాట ర్యాలీ గ్రామ పురవీధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ



కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేస్తున్న తహసిల్దార్, వ్యవసాయాధికారి

**మద్దూర్,మే14 ప్రభాతవార్త :** మద్దూర్ మండలంలోని మద్దూర్, పల్లెగడ్డ తండా, దోరేపల్లి ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మహేష్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ సంయుక్తంగా తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోలు,తూకం,నిల్వ మరియు మిల్లులకు తరలింపు ప్రక్రియలను పరిశీలించిన అధికారులు రైతుల ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే తూకం వేసి త్వరితగతిన మిల్లులకు తరలించాలని సిబ్బందికి ఆదేశించారు.అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తార్పాలిన్లు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియనిర్వహించాలని అధికారులు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు చేయూత



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసిన శ్రీశైలం

**పెద్దమందడి,మే 14 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిధిలోని పాముల రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఇద్దరు వ్యక్తులు పెద్ద బాలస్వామి, బర్ల మల్లయ్య మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు తూడి మెగారెడ్డి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి తక్షణ ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధుర మంజుల, శ్రీశైలం ఉపసర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు కొంకలి నరేష్, కావలి కృష్ణ, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన రైతన్నలు



రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రారంభించేలా చేసిన ఎస్సై జగన్

**గోపాల్ పేట, మే 14 ప్రభాతవార్త :** ప్రభుత్వం నిరక్ష్యంల్ల వల్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాలలో చాలా రోజులుగా పంటలు కోసి ఆరబెట్టుకొని వారాలు గడుస్తున్నా కూడ ఆ వడ్లను ప్రభుత్వం కొనుగోలు చెయ్యక, అకాల వర్షాలు పడి నోటికాడికి వచ్చిన పంట నాశనం అవుతుందని గ్రహించి, ఆగ్రహం తో బుద్ధారం రైతులు, ప్రజలు రోడ్డు పై ధర్నాకు దిగారు. దాదాపుగా 2 గంటల 30 నిముషాలు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న గోపాలపేట తహసిల్దార్, గోపాల్‌పేట ఎస్సై జగన్ ధర్నా చేస్తున్న దగ్గరకి వచ్చి రైతులకి నచ్చజెప్పి, ఐకేపీ సెంటర్ దగ్గరికి వెళ్లి వడ్ల కొనుగోలును మళ్ళీ మొదలు పెట్టారు. కార్యక్రమం లో రైతులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## రేషన్ బియ్యం పట్టివేత.. కేసు నమోదు



బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

**బాలానగర్,మే 14 ప్రభాతవార్త :** మండలంలోని మోతి ఘనాపూర్ గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ బొలెరో వాహనాన్ని పెట్రోలింగ్ పోలీసులు గురువారం ఉదయం గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేయగా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న సుమారు 40 బస్తాల రేషన్ బియ్యం లభ్యమైంది. ఈ ఘటనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాగిణి ఫిర్యాదు మేరకు పోలీసులు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

### స్వీకార్ పాన్ షాప్ శ్రీనుకు అండగా నిలిచిన ఎనుముల తిరుపతి రెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తిరుపతిరెడ్డి మిత్ర బృందం

**వనపర్తి, మే 14, ప్రభాతవార్త :** సాటి మనిషి కష్టాల్లో ఉంటే సహాయం చేయడమే మానవత్వం అని నిరూపించిన ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి పట్టణానికి చెందిన స్వీకార్ పాన్ షాప్ శ్రీను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాదు లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స కోసం కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ముఖ్యమంతి సోదరుడు ఎనుముల తిరుపతి రెడ్డి, శ్రీను వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని తిరుపతి రెడ్డి మిత్రమండలి ద్వారా గౌనీ వంశీ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గోనూర్ రాజు గుప్త గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఎనుముల తిరుపతి రెడ్డి ఫోన్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సహాయం చేసిన ఎనుముల తిరుపతిరెడ్డి మిత్రబృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నాలుగు అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**మాగనూర్, మే14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అడివిసత్యారం పెద్దవాగు వంతెన సమీపంలో గురువారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను టాస్క్ ఫోర్స్, మాగనూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించారు. సంబంధిత నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు. అక్రమ ఇసుకరవాణాపై ప్రత్యేకనిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాగనూర్ పోలీసులు హెచ్చరించారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి



**వనపర్తి రూరల్, మే14, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని 3వ వార్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం సుమారు 10 గం.ల సమయంలో సాత్విక్ అనే 7 సంవత్సరాల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ వీధి కుక్క కరిచింది. బాలుడి తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తమై ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. 3 వ వార్డులో వీధి కుక్కల సమస్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను తరలించి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

## బడిబాట ర్యాలీని ప్రారంభించిన సర్పంచ్

**మల్దకల్ మే 14, ప్రభాతవార్త:** విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ ర్యాలీని గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మరియమ్మ అధ్యక్షతన నిర్వహించిన తల్లి దండ్రుల సమావేశంలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని తెలియజేస్తూ, పాఠశాలలో ఉన్న ప్రత్యేకతలు ప్రయోగ శాలలో అనుభవ పూర్వక అభ్యసన, డిజిటల్ ప్రత్యేక తరగతుల నిర్వహణ, కంప్యూటర్ ల్యాబ్, క్రీడలు, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత, పౌష్టిక మధ్యాహ్నభోజనం, ఉచిత యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లతో పాటుగా రాబోయే సంవత్సరం ప్రతిరోజూ బలవర్ధకమైన అల్పాహారం, పాలు, షూస్, సాక్స్, బెల్ట్ మొదలగు 9 వస్తువులను ఉచితంగా అందించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ తెలియజేశారు. వంట పోటీలలో విజేతలైన మధ్యాహ్న భోజన కార్మికులను శాలువా జ్ఞాపికలతో సన్మానించారు. రాబోవు విద్యా సంవత్సరంలో బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేందుకు అందరూ సహకరించాలని తీర్మానించారు. అనంతరం పాఠశాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తల్లి దండ్రులు, అమ్మా ఆదర్శ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఉపాధ్యాయులు విష్ణు, అక్షితుడు, సుమలత, ఋషి రాజు, ధనుంజయ, సరిత, ఆనంద్, రవి, అనితా రాణిలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులలో కూలీల హాజరు శాతం పెంచాలి



సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న జెడ్పీసీఈవో యాదయ్య

**ఖిల్లాగణపురం మే 14, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనులలో కూలీల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా పరిషత్ సీఈవో యాదయ్య అన్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ పథకం పై సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు వర్క్ సైట్‌లో ఉన్నటువంటి సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్బీఎం కార్యక్రమాలు ఐహెచ్హెచ్ఎల్ మరుగుదొడ్లు మరియు సిఎస్సిల పురోగతిని పరిశీలించారు. రాబోయే వర్షాకాలంలో మొక్కలు నాటే లక్ష్యాల సాధన పై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం మరియు ఇతర సంక్షేమ పథకాల అమలును సమీక్షించారు గ్రామపంచాయతీ స్థాయిలో చెత్త సేకరణ పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఘనంగా బడిబాట




బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**జడ్చర్ల, మే 14 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని పిఎం శ్రీ పాఠశాలలో ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా అవగాహన ర్యాలీ, పేరెంట్స్-టీచర్స్ మీటింగ్, విద్యా అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల సిబ్బంది కలిసి విద్య ప్రాముఖ్యత, పాఠశాల హాజరు, పరిశుభ్రత మరియు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మండల విద్యాధికారి కె. మంజులాదేవి పాల్గొని విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, శుభ్రత ఉన్నత లక్ష్యాల సాధనపై మార్గదర్శనం చేశారు. తల్లిదండ్రులతో నిర్వహించిన పిటీఎం సమావేశంలో విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతోఅవసరమని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ, ఉర్దూ మాధ్యమ ప్రధానోపాధ్యాయురాలు కౌసర్, హై స్కూల్ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పాఠశాల సిబ్బందిని ఎంఈఓ మంజులాదేవి అభినందించారు.

## శ్రీరంగాపూర్ జూనియర్ కళాశాలలో హెల్త్ అవేర్నెస్ డే కార్యక్రమం

**శ్రీరంగాపూర్, మే 14 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారంవిద్యా వారోత్సవాలలోభాగంగా పిటిఎం అండ్‌హెల్త్ అవేర్‌నెస్‌డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇజే మోజస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. మెడికల్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా శ్రీరంగాపూర్ పిహెచ్‌సి డా. నవనీత విద్యార్థులకు స్టాఫ్ మెంబర్స్‌కు హెల్త్ చెకప్ నిర్వహించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్టాఫ్ మెంబర్ కు ఆహార నియామాలు, వేసవి కాలం లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, భవిష్యత్ ఉన్నత విద్యావకాశాలపైఅవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్నిప్రస్తావించారు. అధ్యాపకులు శ్రీధర్, ఆశాజ్యోతి, శ్రీనివాసులు, కురుమూర్తి, కృష్ణమూర్తి, సదయ్య, వెంకటకృష్ణ, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ స్థానంలో

## నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పెబ్బేరు, మే 14 ప్రభాతవార్త:** విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు పట్టణంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిలు ముఖ్య అతిథులుగా హాజరై మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా ఏబిడి లిక్కర్ ఫ్యాక్టరీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.49 లక్షల నిధులతో మండల పరిధిలో 13 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికరించి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వాటిలో పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రం, పెబ్బేరు లోని రెండో వార్డులో అంగన్వాడీ కేంద్రం, చెలిమిల్లలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహార పథకం త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. సన్న బియ్యం, మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలు పెంపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా పెట్టుబడులు పెడుతోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఏబిడి కంపెనీ వారు సీఎస్ఆర్ నిధుల కింద రెండు శాతం నిధులను, పెబ్బేరు మండలంలో విద్యారంగం మరియు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ బీడీ లిక్కర్ కంపెనీ ఆధ్వర్యంలో పెబ్బేరు, శ్రీరంగాపూర్‌మండల పరిధిలో 13 అంగన్‌వాడి కేంద్రాలను మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దడం అభినందనీయమని తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలను మోడల్ అంగన్‌వాడీలుగా తీర్చిదిద్దినందుకు ఏబీడీ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు సంరక్షించుకోవాలని బాగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎబిడి లిక్కర్ కంపెనీ డైరెక్టర్ రాజేష్, కంపెనీ ప్రతినిధులు ఉమాశంకర్, వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ సుమిత్ర, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా ఆదుకునేందుకే రుణాలు

### -ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



గ్రామీణ కూట కార్యాలయం ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే14 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల లోని మహిళా చిరు వ్యాపారులను ఆదుకునేందుకు గ్రామీణ కూట బ్యాంకు ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయడం జరుగు తుందని డివిజన్ మేనేజర్ వారణాసి చంద్రశేఖర్ తెలిపారు. గురు వారం జిల్లా కేంద్రంలో బ్యాంకు కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ బ్యాంకు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్బీఐ నిబంధనల ప్రకారం అందించే రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని రుణాలను తిరిగి చెల్లించాలని కోరారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు రుణాలతో పాటు వారిని చైతన్యం చేసి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు అనంతరం ఆరు గురు మహిళలకు ఎమ్మెల్యే రుణాల చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్‌నరేష్, సపోర్టింగ్ మేనేజర్ మాణిక్యం, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, శంకర్, సింధు, చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

**భూత్పూర్, మే 14, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాలలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. భూత్పూర్ మున్సిపాలిటీలోని రెండో వార్డు శేర్పల్లి(బి), భూత్పూర్ మండలంలోని పెద్దతండా, కొత్తూరు, హస్నాపూర్‌లలో ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించి లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, రెండో వార్డు కౌన్సిలర్ నిమ్మల అన్నపూర్ణతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కినవీన్‌గౌడ్, మూడోవార్డు కౌన్సిలర్ పాల్యావత్ లాల్య(లాలూ నాయక్)లు పాల్గొనగా, మండల పరిధిలోని కొత్తూర్, హస్నాపూర్, పెద్దతండాలలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాలకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి మాజీ అధ్యక్షుడు కదిరె శేఖర్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్‌లతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు సుశీలమ్మ(పెద్దతండా), తాళ్లగడ్డ సంజీవరెడ్డి (హస్నాపూర్) మలిశెట్టి వెంకటేష్ (కొత్తమొల్గర), మాసగౌడ్ (కప్పెట), తారునాయక్(భట్టుపల్లితండా ఏవీఆర్‌కాలనీ), రమేష్(వెల్కిచర్ల)లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రాంరెడ్డి, కొండన్న, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, మాధవరెడ్డి, రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, గడ్డం యాదయ్య, పులగుర్ల మల్లేష్, నిమ్మల సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్య బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

◆ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు



**మల్దకల్ మే14, ప్రభాతవార్త:** మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రిన్సిపల్ శ్రీలత రెడ్డి అధ్యక్షత జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, హెల్త్ అవేర్నెస్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి తీసుకున్న కార్యక్రమాలను సమాజానికి తెలవడం కోసం మరియు సమాజ భాగస్వామ్యం కోసం ఈ విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డిజిటల్ బోర్డులు మరియు ఫర్నిచర్, మైనర్ రిపేర్లకు గ్రాంట్లు మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా కళాశాల ప్రాంగణం శుభ్రంగా ఉంచడం కోసం స్వీపర్ స్కావెంజర్ గౌరవ వేతనాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం మంచి అధ్యాపకులను నియమించడం జరిగిందని అదేవిధంగా భవిష్యత్తులో ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పరీక్షల సన్నద్ధం కావడం కోసం ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు మరియు మానసిక అభివృద్ధికి స్టూడెంట్ కౌన్సిలర్ల నిర్వహించి హెల్ప్ ప్రోగ్రాములు నడుపుతున్నడంవల్ల విద్యార్థుల ఉత్తీర్ణతశాతం కూడా పెరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న మంచి వసతులు అధ్యాపకులను వినియోగించుకోవడం కోసం కళాశాలలో అడ్మిషన్లు పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత రెడ్డి మేడం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని కావున విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు కళాశాల ప్రత్యేకతలు గ్రామాలలో ప్రచారం చేసి అడ్మిషన్లు పెంచడం ద్వారా ఇంకా ఈ కళాశాల అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ గారు మాట్లాడుతూ ఈ కళాశాల మా గ్రామంలో ఉంది కాబట్టే ఇక్కడ అమ్మాయిలు డ్రాప్ కాకుండా విద్య కొనసాగిస్తున్నారని తెలుపుతూ ఈ కళాశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ నవీన్ గారు విద్యార్థులకు ఆరోగ్యం పట్లపలు జాగ్రత్తలు మరియు వయోజన దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మంచి పౌష్టికాహారంతోఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో నేతువానిపల్లి సర్పంచ్ పద్మావెంకటేష్ నాయక్, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్‌సువర్ణ మరియు అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్ భాగ్యలక్ష్మి రాఘవేంద్ర, రంగస్వామి, ఇష్తికర్ ,నీలవేణి మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకొని జాతీయ స్థాయికి ఎదగాలి

◆ కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ , మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 14 ప్రభాతవార్త:** క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదగాలని కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌లు సూచించారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని మిలీనియం ప్రైవేట్ పాఠశాల ఆవరణలో సీనియర్ క్రీడాకారుడు మబ్బు భానుప్రకాష్, సైదులు ఏర్పాటు చేసిన బీఎస్ క్రికెట్ అకాడమీను గురువారం పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌లతో పాటు హైదరాబాద్ సిటీ క్రికెట్ క్లబ్ ప్రధాన శిక్షకుడు అహ్మద్, హైదరాబాద్ జట్టు రంజీ క్రీడాకారుడు మొహమ్మద్ అలీ, అండర్19 క్రీడాకారుడు మొహమ్మద్ నుమాన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో సీనియర్ క్రీడాకారులు మబ్బు భాను ప్రకాష్, సైదులు, క్రికెట్ అకాడమీ నెలకొల్పడం క్రీడాకారులకు శుభ పరిణామమని అన్నారు. గ్రామీణ, పట్టణ క్రికెట్ క్రీడాకారులు బిఎస్ క్రికెట్ అకాడమీను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు మబ్బు రామరాజు, నాజియా మక్బూల్, అస్మిత చంద్రకాంత్ రెడ్డి, మిలీనియం పాఠశాల కరస్పాండెంట్ గోకమల్ల కరుణాకర్, ప్రిన్సిపల్ దీపిక, సీనియర్ క్రీడాకారులు ఇంతియాజ్ ఖాన్, జహీర్, సాయిలతో పాటు బిఎస్ క్రికెట్ అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న విసి శ్రీనివాస్

## లా, బిఈడి పరీక్షల ఫలితాలు విడుదల

**మహబూబ్‌నగర్, మే14, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో న్యాయ శాస్త్రం మొదటి, మూడవ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్ లాగ్, బిఎడ్ మొదటి, మూడవ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పి రమేష్ బాబుతో కలిసి గురువారం విడుదల చేశారు. బి.ఎడ్ మూడవ సెమిస్టర్‌లో మొత్తం 2416 మంది విద్యార్థులు ఉండగా, 1955, 80.92% పాస్ అయినట్లు తెలిపారు. ప్రమోటెడ్ అయిన విద్యార్థులు 461, 19.08%, బి.ఎడ్ మొదటి సెమిస్టర్ మొత్తం విద్యార్థులు 2500 పాసైన విద్యార్థులు 1795, 71.80% ప్రమోట్ అయిన విద్యార్థులు 701, 28.04% ఉన్నారు. కాగా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురిని గుర్తించి డి మార్ట్ చేసినట్టు తెలిపారు. న్యాయ శాస్త్రం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ మరియు బ్యాక్లాగ్ మొత్తమువిద్యార్థిని విద్యార్థులు 288 పాసైన విద్యార్థులు 156, 54.17% ప్రమోటేడ్ విద్యార్థులు 132, 45.83% , న్యాయశాస్త్రము మూడవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ మొత్తం విద్యార్థులు179, పాసైన విద్యార్థులు 97, 54.19 % , ప్రమోట్ అయిన విద్యార్థులు 82 45.81% ఉన్నారని తెలిపారు.

## జడ్చర్లలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

### 24 గంటల పాటు నిలిపివేత

**జడ్చర్ల మే 14, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి శనివారం ఉదయం 8:00 గంటల వరకు (24 గంటల పాటు) నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ మహబూబ్ నగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల విబి44 ఫ్లైఓవర్ సమీపంలో జడ్చర్ల- కావేరమ్మపేట సర్వీసు మార్గంలో ఉన్న జడ్చర్ల మునిసిపాలిటీ మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మార్చవలసి ఉన్నది. ముందస్తు ప్రణాళికలో భాగంగా పైపులైన్ మరమ్మతు నిర్వహణ పనులు చేయుటకు ఈ షట్‌డౌన్ చేపడుతున్నారు. మల్లెబోయినపల్లి నీటి శుద్ధికర్మాగారం నుండి నీటి సరఫరా పొందుతున్న జడ్చర్ల మున్సిపాలిటీ ప్రభావితమవుతుందని, ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని సహకరించవలసిందిగా కోరారు.

## వీహెచ్, చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపిన సంజీవ్ ముదిరాజ్



వీహెచ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్, మే14, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమం, అభివృద్ధి సలహాదారులుగా గురువారం బాధ్యతలు స్వీకరించిన పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతురావును డీసీసీ అధ్యక్షులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ హనుమంతురావు నియామకం కాంగ్రెస్ పార్టీకే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం బీసీ సమాజానికి గర్వకారణమని తెలిపారు. అదే విదంగా తెలంగాణ షిప్. గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సరితకు, రజక ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన చైర్మన్లు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అణగారిన వర్గాలఅభివృద్ధి, కాంగ్రెస్‌పార్టీ సిద్ధాంతాల బలోపేతానికి విశేషంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షి ంచారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య : ఎంఇఓ పి.ఇమాన్యుయెల్



బడి బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఓ పి.ఇమాన్యుయెల్

**కొల్లాపూర్, మే 14, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ఆర్ఐడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించనైనది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లి తండ్రులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి పి. ఇమ్మానుయేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆరవతరగతి నుండి పదొవ తరగతి వరకు విద్యార్థులకు (బాల బాలికలకు) ఈ పాఠశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. చక్కని బోధన నైపుణ్యం, విద్యార్థులు చక్కగా నేర్చుకొనుటకుకంప్యూటర్స్, డిజిటల్ పద్ధతితో బోధన పద్ధతి ఉంటుంది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంతో పాటుఇంగ్లిష్ మీడియం కూడా ఉంటాయి. డబ్బులను వృధాచేసుకోకుండా ప్రభుత్వ పాఠశాల లో చేర్పించండి. ఇప్పటికి నూతనంగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం అడుగుతున్నారు. స్థానిక యంపిఎస్ రాజవీధీ పాఠశాల ఉపాధ్యాయులు, మా ఉపాధ్యాయుల చొరవతో అందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బడిబాటలో భాగంగా జమల్ గడ్డ ప్రాంతము, వర్ధ్యాల ప్రాంతాలను తిరుగనైనది. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాంప్లెట్ రూపంలో అందించనైనది. బడిబాట విసిటింగ్‌లో భాగంగా యుపిఎస్ వరిద్యాల ఉపాధ్యాయులను కలిసివారి బడిబాట కార్యక్రమంను పరిశీలించనైనది. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ నేను ఫజుల్ తండ్రి ఫిరోజ్ ఖాన్, నివాసం 20-131/11, బీసీ కాలనీ, కోస్గి మండలం, నారాయణపేట జిల్లా, నా మైనర్ కొడుకు పేరు ఫవ్వజ్ తండ్రి ఫజుల్ నుండి ఫవ్వజ్ ఖాన్ తండ్రి ఫజుల్‌గా మార్చబడింది.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## వయో వృద్ధుల సమస్యలను పరిష్కరిస్తాం

◆ వయవృద్ధుల ఇబ్బందులను తొలగిస్తాం : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మాట్లాడుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 14, ప్రభాతవార్త:** జిల్లా వయో వృద్ధుల సంక్షేమ కమిటీసమావేశం గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, ఇబ్బందులను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వయోవృద్ధుల సమస్యలపై అధికార యంత్రాంగం సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, వయోవృద్ధులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. సమావేశం ప్రారంభంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం జిల్లాలో వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. వృద్ధుల సంక్షేమం కోసం 2026 జనవరి 12న"ప్రణామ్ సెంటర్" ప్రారంభించామని ఆమె తెలిపారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు నివేదికను కూడా కలెక్టర్‌కు సమర్పించారు. అనంతరం వృద్ధుల ఫోరం సభ్యులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో సాధారణ ప్రజలతో పాటు ఎక్కువసేపు క్యూల్లో నిలబడాల్సి వస్తోందని, వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. హిట్ అండ్ రన్ ప్రమాదాల్లోఎక్కువగా వృద్ధులే బాధితులవుతున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులపై ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తి చేసి, ముఖ్యంగా వృద్ధులు సురక్షితంగా నడిచేలా చర్యలు తీసుకోవాలనికోరారు. అదేవిధంగా రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌ను అరికట్టాలని, ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టంచేయాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధులకు సంబంధించిన ఫైళ్లు, వినతులు ఆలస్యంగా పరిష్కారమవుతున్నాయని కూడా వారు ఆవేదన వ్యక్తం చేశారు. నలంద కాలనీలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, పద్మావతి కాలనీ రోడ్డుపై ప్రమాదాలకు కారణమవుతున్న అధిక ఎత్తైన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విశాలమైన భవనాల్లో మెరుగైన సౌకర్యాలతో ప్రణామ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఒక సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుడు కోరాగా, దీనిని పరిశీలిస్తామని కలెక్టర్ అన్నారు. అలాగే రోడ్ల మీద ఫుట్ పాత్‌ల ఆక్రమణ కావడం వలన వృద్ధులకు రోడ్ల మీద రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించి వృద్ధులు సురక్షితంగా నడిచే వీలును కల్పించాలని కోరారు. ప్రతి నెలకనీసం ఒకసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆయుష్ శాఖ ద్వారా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వయోవృద్ధులలో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు అందించాలని కూడా విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతి నెల మొదటి తేదీన వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. 60సంవత్సరాలు పైబడిన మహిళల కోసం స్వయం సహాయక సంఘాలుఏర్పాటు చేయాలని సభ్యులు డిఆర్‌డిపి అధికారులను కోరగా, ఈ కార్యక్రమం ఇప్పటికే అమలులో ఉందని కలెక్టర్ తెలిపారు. వృద్ధ మహిళల్లో మరింత అవగాహన కల్పించాలని డిఆర్‌డిపి అధికారులను ఆదేశించారు. సమావేశంలో వృద్ధుల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా, వృద్ధుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, వారి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యన్.బి రత్నం, డిఆర్‌డిఓ నరసింహులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, వైద్య శాఖ అధికారులు, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు బాలయ్య, నాగేంద్రస్వామి జగపతిరావు, పాండురంగం, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కేబినెట్‌లోకి జేజమ్మ?

- కేంద్ర మంత్రివర్గ విస్తరణలో మహబూబ్‌నగర్ ఎంపీ అరుణమ్మకు ఛాన్స్?
- సర్వత్రా చర్చనీయాంశం
- అరుణమ్మకే ఇవ్వాలని కోరుతున్న పార్టీ శ్రేణులు
- కేంద్రం నిర్ణయం పై ఉత్కంఠ



**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 14 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా నుంచితొలి మహిళా మంత్రి గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం లో తొలి మహిళ పార్లమెంట్ సభ్యురాలిగా.. మూడు సార్లు శాసన సభ్యురాలిగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నాతలబడి..నిలబడి..ఉప్పెనలా ఎగిసిపడి తన సత్తాను మరోసారి చాటారు అరుణమ్మ. తెలంగాణలో అత్యంత శక్తివంతమైన మహిళగా, బిజెపిలోనూ అత్యంత ఉన్నతమైన స్థానంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు స్థానంలో ఉండడం కేవలం డీకే అరుణమ్మకే చెల్లింది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేరుమరోసారి ఇటు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దక్షిణ భారతదేశంలోనూ చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం తన మంత్రివర్గ పునర్వ్య వస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. కొత్త వారికి, మహిళా ప్రతినిధులకు మంత్రివర్గంలో చోటుకల్పించే దిశగా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కేంద్రం దక్షిణ భారతదేశానికి ప్రాధా న్యత కల్పించనున్న నేపథ్యంలో అరుణమ్మకు కూడా లైన్ క్లియర్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. సీనియర్ నేతగా ఉన్న డీకే అరుణకు ఈసారి మంత్రి పదవి ఖాయమని జిల్లా వ్యాప్తంగా విశ్లేషణలు వినిపిస్తు న్నాయి. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఉమ్మడిజిల్లాకుప్రాతినిధ్యం కల్పించేలాఈనిర్ణయం ఉండవచ్చని తెలుస్తున్నది.

**అరుణమ్మ ప్రత్యేకతలు :** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నడిగడ్డగా పేరుగాంచిన గద్వాల నియోజకవర్గం నుంచి శాసన సభ్యురాలిగా హ్యాట్రిక్ సాధించి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిల్లా నుంచి తొలి మహిళా మంత్రిగా బాధ్యతలు చేపట్టి..డి.కె.అరుణ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకురాలు, రాష్ట్ర మాజీ మంత్రి. గద్వాల శాసనసభ నియోజకవర్గం నుంచి 2004 నుండి 2018 వరకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించింది. 2009 శాసనసభ ఎన్నికల నంతరం వై.ఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో స్థానం పొంది జిల్లా తరపున రాష్ట్రమంత్రివర్గంలో చోటుపొందిన తొలి మహిళా నేతగా పేరు సంపాదించింది. పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండూ రాజకీయాలలో పేరుపొందినవే. తండ్రి, సోదరుడు ఇదివరకు మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి గెలుపొందగా, మామ, భర్త గద్వాల నుంచి ఎన్నికైనారు. మహబూబ్ నగర్ లోక్‌సభ స్థానం నుంచి ఒకసారి, గద్వాల అసెంబ్లీకి రెండుసార్లు ఓడిపోయినా 2004లో తొలిసారి గెలుపొంది శాసనసభలో అడుగు పెట్టగా మళ్ళీ 2009లో రెండో సారి విజయం సాధించి రాష్ట్ర మంత్రి వర్గంలో చిన్నతరహా పరిశ్రమల శాఖామంత్రిగా (1) నియమించబడి 13 మే 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్ సభ నియోజక వర్గం నుండి ప్రాతి నిధ్యం వహిస్తుంది.

**పాలమూరుకు మహర్దశ? :** డీకే అరుణకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఏర్పడితే పాలమూరుకు మహర్దశ పట్టనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జాతీయస్థాయిలో మహబూబ్‌నగర్ సమస్యలు మరింత బలంగా వినిపించి కేంద్రం నుంచి రావలసిన నిధుల విషయంలోనూ పట్టుబట్టి తీసుకొచ్చేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు.

## రజక సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

### అందజేసిన జిల్లా రజక సంఘం నాయకులు

**ఖిల్లాఘనపురం మే 14, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రజక సంఘం రాష్ట్ర చైర్మన్గా పదవీ బాధ్యతలు చేపట్టిన దాస రాజు అజయ్ కుమార్ పదవీ ప్రమాణ స్వీకారంలో భాగంగా గురువారం వనపర్తి జిల్లా రజక సంఘం నాయకులు విజయ్‌తో పాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, దాసోజు, శ్రీనివా సులు, వెంకట్‌రాములు, లక్ష్మయ్య, రాజేష్, సలేష్, ఆనంద్, కొత్తకోట బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు

### వనపర్తి బీసీ కళాశాల వసతి గృహ విద్యార్థినులు

**వనపర్తి, మే 14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభా పురస్కారాలు" అందజేస్తోంది. ఈ ఏడాది వనపర్తి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థినులు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. వనపర్తి, కొత్తకోట బీసీ బాలికల కళాశాల వసతి గృహాల్లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న బి. ప్రశాంతి, షారుఖా ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న బి. ప్రశాంతి 470 మార్కులకు గాను 455 మార్కులు సాధించగా, రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని షారుఖా 1000 మార్కులకు గాను 972 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. గురువారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషనర్ బాల మాయదేవి చేతుల మీదుగా విద్యార్థినులకు రూ.10 వేల నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారాలకు వనపర్తి జిల్లా విద్యార్థినులు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులకు



ఉత్తమ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నాణ్యమైన విద్య, వసతి, ఆహారం అందిస్తూ ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు, వసతి గృహ సంక్షేమ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ ఖాన్, వనపర్తి బీసీ కళాశాల వసతి గృహ అధికారిణి కే. మాధవి, కొత్తకోట బీసీ కళాశాల వసతి గృహ అధికారిణి బి. విజయ, విద్యార్థినుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## విజేత అప్పాజిపల్లి జట్టు

- రన్నర్ గా కొత్తకుంట తండా యువసేన టీం
- 75 టీంలు.. 11 రోజులు..
- విజయవంతంగా ముగిసిన సిఎల్ఆర్ ఛాంపియన్స్ ట్రోఫీ
- గెలుపొందిన జట్టుకు రూ. లక్ష నగదు బహుమతి అందజేసిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, మే 14, ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో కీ.శే. చర్లకోల శ్వేత జ్ఞాపకార్థం నిర్వహించిన సిఎల్ఆర్ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ 2026 విజయవంతంగా ముగిసింది. 11 రోజులపాటు జరిగిన టోర్నీలో దాదాపు 72టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన బాలానగర్ మండలం అప్పాజిపల్లి టీంకు మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి లక్ష రూపాయల ప్రైజ్ మనీతో పాటు కప్ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన నవాబ్‌పేట మండలం కొత్తకుంట తండా యువసేన టీంకు యాభై వేల రూపాయల ప్రైజ్ మనీ, కప్ అందజేశారు. రెండు టీమ్‌లతో పాటు టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని క్రికెట్ జట్లకు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. జడ్చర్ల నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి, విజయవంతం చేసిన ఆర్గనైజర్లను మాజీ మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం వెలికితీసేందుకు ఇటువంటి టోర్నీలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై బడిబాట

- సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి
- ఎంఈఓ బషీర్ అహ్మద్

**లింగాల, మే 14, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తూ ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ అన్నారు. ఈనెల 19 వరకు కొనసాగే ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రమైన లింగాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలంటే ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మాత్రమే కాదని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నామని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికల ను పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తృతంగా చేపట్టారని గుర్తు చేశారు. గ్రామాలలో పర్యటిస్తూ తల్లిదండ్రులను కలుసుకొని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా లింగాల హైస్కూల్ ఉపాధ్యాయ బృందం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, ఇంగ్లీష్ తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం, విశాలమైన ఆట స్థలంలో వ్యాయామం కరాటే, విలువైన పుస్తకాలతో గ్రంథాలయం, స్మార్ట్ టీవీ ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల నిర్వహణ, విద్యార్థులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆహ్లాదకరమైన వాతావరణం, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వివరిస్తూ బడిబాట ప్రచారాన్ని నిర్వహించారు. ఆలాగే పాఠశాలల్లో అమలు చేస్తున్న ఇంగ్లీష్ మీడియం డిజిటల్ తరగతులు మెరుగైన బోధన విధానాల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. మండలంలోని గ్రామాలలో ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమం పట్ల మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బషీర్ అహ్మద్, ఇంచార్జ్ హెచ్ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.




బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈఓ బషీర్ అహ్మద్

## నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

◆ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

◆ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్

**కొల్లాపూర్, మే14, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్షా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకేజీలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చిత్రపటాన్ని నిరసిస్తూ విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని మండిపడ్డారు. నీట్ పరీక్షలు ప్రతి సంవత్సరం అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాలతో వార్తల్లో నిలుస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం, ఎన్టిఎ ఎలాంటి సంస్కరణలు తీసుకురాకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీ మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఉన్న పెద్దల్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే అసలు నిందితులు బయటకు రావడం లేదని విమర్శించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆటలాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని, వెంటనే ఎన్టిఎ రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. అలాగే నీట్ పేపర్ లీకేజీ వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా వెలికితీసి, వారికికఠిన శిక్షలు విధించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులు ఎవరు? బిజెపి ప్రభుత్వం సమాధానం చెప్పాలి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, ఎన్టిఎ రద్దు చేయాలి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆపాలి! పేపర్ లీకేజీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా సహాయ కార్యదర్శులు అనుష, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లాకార్యదర్శిఇందిరమ్మ, విద్యార్థినాయకులుశ్రీశాంత్, ఆదిత్య, గణేష్, శివ, కార్తికేష్, గాయత్రి, శ్రీనిధి, అక్షర, భవ్యశ్రీ, కావ్య శ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్

## ఉపాధి కూలీలకు 600 రూపాయలు ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



**వీపనగండ్ల మే 14, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేసేటువంటి కూలీలకు రోజువారి కూలిని 600 రూపాయలకు పెంచాలని పని దగ్గరనే ప్లే సిప్పులు ఇవ్వాలని వనపర్తి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేకల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు మండలంలోని పుల్గా జర్ల గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన కలవడం జరిగింది. ఈ సందర్భంగా కూలీలకు ఉన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. వేసవిలో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్న వాళ్లకు సరిపోను నీటి వసతి మరియు అందుబాటులో మందులు ఉంచడం లేదు అని ఆయన దృష్టికి వారు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు 13 వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్న వాళ్లకు ప్లేసు ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. నిత్యవసర వస్తువులు ధరలు పెంచుతూ ప్రభుత్వం కూలీరేట్లను పెంచకపోవడం మూలంగా వారికి కనీసం కూలి రేటు కూడా పడడం లేదని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఆయన తెలిపారు. కూలీలు గురి కాకుండా వారికి రోజువారిగా వైద్యం అందించాలని ఆయన తెలిపారు ఉపాధి హామీ కూలీల సమస్యలపై దేశవ్యాప్తంగా పనిబందును చేయడం జరుగుతుందని దాన్ని విజయవంతం చేయాలని కూలీలను ఆయన కోరారు. ఈయనతోపాటు రైతు సంఘం నాయకులు ఎం రాములు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోడపత్రికను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్

**మక్తల్ టౌన్, మే 14 ప్రభాతవార్త:** మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026, 27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15 నుంచి రెండో విడత దోస్త్ అప్లికేషన్స్ ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోడపత్రికను మున్సిపల్ చైర్మన్ వాటికి మానస హనుమంతు, వార్డు కౌన్సిలర్ అల్లూరి పావని కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని, పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్ ద్వారా మన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నాగశివ, వార్డు కౌన్సిలర్ లు సరిత గోవిందరావు, రహీం పటేల్, మంజూరు ఇలాహి, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, హుస్సాముద్దీన్ , టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, కాడిగి హనుమంతు, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్ ,గఫర్, మహమ్మద్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మారెమ్మ దేవాలయానికి భూమి పూజ చేస్తున్న డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే

## మారెమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

**వనపర్తి, మే 14, ప్రభాతవార్త:** గురువారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో మారమ్మ కుంట పరిధిలో ఉన్న మారెమ్మ గ్రామదేవత గుడి శిథిలావస్థ చేరడంతో స్థానిక కౌన్సిలర్ సౌమ్య రఘుల వినతి మేరకు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి మరేమ్మ ( గ్రామ దేవత) కు నూతన గుడి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థచైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూగ్రామదేవతలు ప్రజలను సుభిక్షంగా ఉంచాలని, అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య ,కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కాంగ్రెస్ నాయకులు కదిరే రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్, పలువురు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులకు ఘనంగా సన్మానం

**జడ్చర్ల, మే14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాలలో భాగంగా స్థానిక డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ జి.సుకన్య, అలుమ్ని కన్వీనర్ డా. బి .సదాశివయ్య ఆధ్వర్యంలో 16 మంది పూర్వ విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఘనమైన చరిత్ర గల కళాశాలలో పూర్వ విద్యార్థులను సత్కరించడం అనేది అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సదాశివయ్య మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్‌లో ఏగ్రేడ్ సాధించిన ఏకైక కళాశాల ఇదియని, ఈ గ్రేడ్ సాధించడంలో పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అమోఘమైనవని సభలో తెలిపారు. నాక్ అక్రిడిటేషన్‌కి వెళ్లే ముందు పూర్వ విద్యార్థులు బ్యాచులు బ్యాచులుగా ఉదారంగా విరాళాలు ఇచ్చి కళాశాలలో అనేక అభివృద్ధి పనులు చేశారని అందువల్లనే నాక్‌లో ఎ గ్రేడ్ సాధించడం జరిగిందని సదాశివయ్య తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి తమ తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకబృందం ఘనంగా సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో మొట్టమొదటి బ్యాచ్‌కు సంబంధించిన ముచ్చర్ల జంగయ్యతో పాటుగాబాద్మి శివకుమార్, మండల విద్యాధికారిని మంజులాదేవి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, గోనెల రవిశంకర్, జనార్దన్ రెడ్డి, రాజేందర్ గౌడ్, అనంత రాములు, ఎలకంటి భాస్కర్, రత్న శేఖర్, స్థానిక మాజీ కౌన్సిలర్ దేశవాళి సతీష్ కుమార్, ఇదే కళాశాలలో చదివి ఇక్కడే పనిచేస్తున్నడా. వి పుష్పలత, డా. కళ్యాణి నరసింహారావు, వెంకట్ రెడ్డి, జగన్‌లు ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. డి నర్మదా, డా.బి. శ్రీనివాసులు, రుకియా భాను, ఆధ్యాపకులు రాఘవేంద్రరెడ్డి, నరసింహులు, వెంకటయ్య, సతీష్ రెడ్డి, ఆంజనేయులు, జయలీల, లతా రజని, నందకిషోర్ పాల్గొన్నారు.

## అధికారం ఉన్నా.. లేకున్నా నేను మీ వాడినే..

### 24వ వార్డు మాజీ కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి

### పదవీకాలం ముగియడంతో కాలనీవాసుల ఆత్మీయ సన్మానం

**జడ్చర్ల, మే 14, ప్రభాతవార్త :** అధికారం ఉన్న లేకున్నా తాను ఎప్పటికీ ప్రజల మనిషినేనని, కాలనీలోని ప్రతి ఒక్కరూ తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించారని కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు మాజీ కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి గత ఐదేళ్లలో అందించిన విశేష సేవలకు గుర్తింపుగా పద్మావతి కాలనీ వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో ప్రశాంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే గుణం ఆయనను ఆదర్శ నాయకుడిగా నిలబెట్టిందని కొనియాడారు. అనంతరం ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తనకు ప్రజాసేవఅనేది ఒక పవిత్ర యజ్ఞమని, పదవిలో ఉన్నాలేకున్నా ప్రజలహృదయాల్లో స్థానం సంపాదించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంట్లో తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించారని, అందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశానని, వార్డు ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు

### అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం ఆధ్వర్యంలో తనిఖీలు

**మహబూబ్‌నగర్, మే14 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలో ఇటీవల తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాల నేపథ్యంలో గురువారం అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం ఆర్అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు ఏ కారణాల వల్ల జరుగుతున్నాయి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి, అదనంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు ఏవీ అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల జిల్లా పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలతో కలిసి అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని అన్నారు. రహదారులపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ పరిశీలనలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఆర్అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

వాహన పత్రాల ఫోటోలుకూడా భద్రపరచాలని సూచించారు. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకొని బాధ్యతాయుతంగా పని చేసి, ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్ట్ వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు కేటీ దొడ్డి మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్ని జిల్లాల్లో పాఠశాల భవనం ప్లాన్ ఒకే విధంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో విద్యుత్ లైన్ మార్చాల్సి ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో పౌర సరఫరాల శాఖ మేనేజర్ విమల, డిఆర్డిఏ ఏపిడి శ్రీనివాస్, కేటీ దొడ్డి తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారావు, విద్యాశాఖ ఇంజనీర్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.